# పెళ్ళికుదిరింది

ఆర్.వి.చలపతి

ఆరవసారి అద్దంలో తన ముఖారవిందాన్ని చూసుకున్నాడు రాజు. క్రాపు కొంచెం చెదిరినట్లు అనిపించి దువ్వెన తీసి మరో సారి దువ్వుకున్నాడు. పౌడరు తీసి ముఖానికి లైట్‌గా అద్దుకున్నాడు.

'ఇంత అందం సొంతం చేసుకోవడానికి ఏ అమ్మాయికి రాసి పెట్టి వుందో?' అని తనకు తానే కితాబు ఇచ్చుకున్నాడు. రూమ్ బయటకు వచ్చి తలుపులు దగ్గరగా వేసాడు.

"అమ్మా! నేను సినిమాకు వెళ్తున్నాను" అని గట్టిగా చెప్పి ఇంటి నుంచి బయటపడ్డాడు. స్కూటర్ స్టార్ట్ చేస్తుంటే ఎదురింటి అమ్మాయి వాళ్ల ఇంటి కిటికీలోంచి ఇటే చూస్తూ కనిపించింది.

'ఏ అమ్మాయి మాత్రం చూడదు తనను?' అని గర్వంగా అనుకుని స్కూటర్‌ను బయలుదేరదీసాడు.

రాజు పోస్టుగ్రాడ్యుయేషన్ ముగించి సంవత్సరం క్రితమే అదే ఊర్లోని ఒక ప్రైవేటు కంపెనీలో మంచి ఉద్యోగంలో చేరాడు.

విద్యార్థి దశ ముగిసి ఏడాది దాటుతున్నా అతడి పైలావచ్చీసుతనం ఏమాత్రం తగ్గలేదు. ట్రిమ్‌గా తయారవడానికి గంట టైము తీసుకుంటాడు. ఆఫీసుకు వెళ్లే ముందైనా, వేరే ఎక్కడికి బయలుదేరేముందైనా ఆరేడుసార్లు అద్దంలో చూసుకుని పూర్తిగా తృప్తి పడితేగానీ అద్దం ముందు నుండి కదలడు.

"ఏమిటో వీడు...వీడి మేకప్‌లు... మరీ ఆడపిల్లలా" అన్నాడు తండ్రి రాజారాం.

"వయస్సు కుర్రాడు కదండీ. పెళ్లయి పిల్లలు పుట్టేదాకా ఈ వేషాలంతా. తరువాత ఏముందీ" కొడుకును వెనకేసుకొచ్చింది తల్లి సీతమ్మ.

"అన్నయ్యా వీధిలోకెళ్తుంటే అమ్మాయిల కళ్లన్నీ అన్నయ్య మీదనే" అని ముసిముసిగా నవ్వింది చెల్లాయి.

"వయస్సు సంగతి సరే. అయితే ఈ వయస్సులోనేకదా పెళ్లి గురించి ఆలోచించాల్సింది. అది మాత్రం కాదంటాడే" అన్నాడు తండ్రి.

"ఎంత మంచి అమ్మాయిని చూపించినా ఏదో ఒక వంక పెట్టి కాదంటున్నాడు. ఇంతకూ వాడి మనసులో ఏముందో?" అంది తల్లి.

ఇప్పటికి పది పదిహేను సంబంధాలు చూసారు.

ప్రతి అమ్మాయికి ఏదో వంక చూపి నిరాకరిస్తూ వస్తున్నాడు రాజు.

★★★

"ఒరేయ్ నిజం చెప్పు. ఏ అమ్మాయీ నీకు నచ్చలేదా?" అడిగాడు మిత్రుడు మురళి ఒక రోజు.

"కాదులేరా. ఏదో సరదాగా, హాయిగా సాగిపోతున్న జీవితానికి పెళ్లి పేరుతో బ్రేకు వేసేస్తారు ఈ పెద్దవాళ్లు. వాళ్ల మాట కాదన్నామంటే కోపం. అందుకే ఏదో వంక పెడుతున్నాను ప్రతి అమ్మాయికి. నిజానికి అలా చేయడం తప్పు అని తెలుసు. అయినా ఏం చేయను?" అన్నాడు రాజు.

"ఓరి బడుద్దాయ్. ఇప్పుడిప్పుడే పెళ్లివద్దని చెప్పవచ్చుకదా. అసలు పెళ్లేవద్దని చెప్పడం లేదుగా. అంతేగానీ చక్కటి అమ్మాయిలకు కూడా వంకలు పెడితే ఆ అమ్మాయిలు బాధపడరూ. వాళ్ల వుసురు నీకు తగలదూ" అని కోపడ్డాడు మురళి.

"అలా శపించకురా బాబూ.. ఇప్పట్లో పెళ్లి వద్దనే చెబుతున్నాను. అయితే మా నాన్నమ్మ చనిపోయేలోగా నా పెళ్లి చూసి పోవాలని సరదా పడుతున్నదట. అయినా తెలియక అడుగుతాను ఈ నాన్నమ్మలకు, అమ్మమ్మలకు మనం ప్రశాంతంగా ఉండడం నచ్చదా ఏంట్రా? మనకూ ఒక గుదిబండను తగిలించిగాని పై లోకాలకు కదలనంటారు" అన్నాడు రాజు.

★★★

"ఒరేయ్... రంగనాధంగారి అమ్మాయిని చూడ్డానికి ఈ రోజు సాయంత్రం వెళ్తున్నాం. నేను ఆ అమ్మాయిని చూసాను. చాలా బావుంటుంది. ఈ సంబంధం కుదిరితే నువ్వు అదృష్టవంతుడివనుకోవాలి" అంది సీతమ్మ ఉదయాన్నే ఆఫీసుకు బయలుదేరుతున్న రాజుతో.

"ఎందుకూ? ఈ సంబంధం కుదిరితే ఆ అమ్మాయే అదృష్టవంతురాలని అనుకోకూడదా? నాకేం తక్కువ?" కోపంగా అడిగాడు రాజు.

"పోనీ అలాగే అనుకో. సాయంత్రం పెందరాళే వచ్చేసేయ్" అని నవ్వింది సీతమ్మ.

'ఈరోజు ఇంకో అమ్మాయి మనస్సును గాయపరచాలన్నమాట' బాధగా అనుకున్నాడు రాజు.


"సుమతి నాకు బాగా తెలుసు. నాతో చదువుకున్నదేగా. అన్నయ్యకు తప్పక నచ్చి తీరుతుంది" అని సంబరపడింది పరిమళ.

"ఏమో! దేవుడి దయవల్ల అలా కుదిరితే అదృష్టమే" అని నిట్టూర్చింది సీతమ్మ.

అనుకున్నట్లుగానే సాయంత్రం పెళ్లి చూపులకు వెళ్లారు.

సుమతిని చూసి రాజు ఆమెను మెచ్చుకోకుండా ఉండలేకపోయాడు.

పెళ్లిచూపుల కోసం ఆమెను గంగిరెద్దులా అలంకరించలేదు వాళ్లవాళ్లు. చాలా సింపుల్‌గా ఉంది ఆమె. గంజిపెట్టి ఇస్త్రీ చేసిన నీలంరంగు మామూలు నూలు చీర, మెడలో ఒకే ఒక సన్నటి గొలుసు, ఒక చేతికి రెండు బంగారు గాజులు, మరో చేతికి రిస్ట్‌వాచ్,



వదులుగా వేసుకున్న పొడవాటి జడ, అందులో ఒకే ఒక గులాబీపువ్వు, నుదుట దోస గింజంత బొట్టు, కళ్లకు లైట్‌గా పెట్టుకున్న కాటుక... ఇవేవీ కావు రాజును ఆకర్షించిన అంశాలు. ఆమె మాట తీరు, స్వచ్ఛమైన చిరునవ్వు రాజును ఆకట్టుకున్నాయి. అనవసరపు సిగ్గును అభినయించకుండా తనతో మాట్లాడిన పద్ధతి మరీ నచ్చింది.

అతని తల్లిదండ్రులకు రాజు కళ్లల్లోని మెరుపు అర్థమైంది. అయినా అప్పటికి ఏమీ చెప్పకుండా తరువాత కబురు చేస్తామని చెప్పి సెలవు తీసుకున్నారు.

"అన్నయ్యా! వదిన ఎలా వుంది? ఇంకా సేపు అక్కడుంటే నీకు మైకం కమ్మేసేది కదూ'' అల్లరిగా అడిగింది పరిమళ ఇంటికి రాగానే.

"ఏరా! ముహూర్తాలు పెట్టించమని కబురు చేద్దామా'' అని అడిగాడు తండ్రి.

"నేను ఆ అమ్మాయిని చేసుకుంటానని ఎప్పుడు చెప్పాను?'' ఎదురు ప్రశ్న వేసాడు రాజు.

అందరూ నిర్ఘాంతపోయారు.

"ఏంట్రా.. ఈ అమ్మాయీ నీకు నచ్చలేదా?'' అడిగింది సీతమ్మ.

"సుమతికి ఏం వంక పెట్టబోతున్నావు?'' కోపంగా అడిగింది పరిమళ.

"లేదమ్మా...ఆ అమ్మాయికి ఏ వంకాలేదు. ఇంతకు మునుపు చూసిన అమ్మాయిలు నచ్చలేదని చెప్పడం కూడా వట్టిదే. ఇప్పట్లో నాకు పెళ్లి చేసుకోవాలనిలేదు అని చెబితే మీరు వింటేగా? అందుకే పెళ్లి చూపులకు రావడం, అమ్మాయి నచ్చలేదని చెప్పడం చేస్తున్నాను.అది నా తప్పేనని వొప్పుకుంటున్నాను. అందులోనూ సుమతిని చూసాక నచ్చలేదని చెప్పడం నాకిష్టం లేదు. నేను కాకుంటే మరో మంచి వరుడే దొరుకుతాడు ఆ అమ్మాయికి. అందువలన అమ్మాయి నచ్చలేదని చెప్పి ఆ అమ్మాయి మనసు బాధపెట్టకండి. నాకు ఇప్పుడిప్పుడే పెళ్లి ఇష్టంలేదని చెప్పానని ఉన్నమాటే చెప్పండి'' అన్నాడు రాజు.

"పెళ్లంటే ఇష్టం లేనప్పుడు పెళ్లి చూపులకు ఎందుకు వచ్చారని వాళ్లు నిలదీస్తే ఏం చెప్పను?'' కోపంగా అరిచాడు తండ్రి.

సమాధానం చెప్పలేక తల వంచుకున్నాడు రాజు.

"చూడు సీతా! ఇక వీడు తనకు తానై వచ్చి పెళ్లికి సిద్ధమేనని చెబితే తప్ప నేను వేరే సంబంధాలు చూడను'' అన్నాడు రాజారాం భార్యతో.

***

"మరీ వయసయినవాడిలా అలా వంగుని నడుస్తావేంట్రా? నిటారుగా నడవలేవూ?'' అన్నాడు తండ్రి.

గతుక్కుమన్నాడు రాజు. 'తన నడకలో మార్పు వచ్చిందా?' అని ఆశ్చర్యపోయాడు.

ఇంకోరోజున ఆఫీసు నుండి రాగానే ఇల్లంతా సందడిగా ఉంది. ఏమిటా అని చూస్తే పరిమళ పాత ఫ్రెండ్స్ నలుగురు వచ్చారు. అంతా కలిసి సరదాగా కబుర్లు చెప్పుకుంటున్నారు.

రాజును చూడగానే "మా అన్నయ్య వచ్చాడే. మీకు అన్నయ్య పరిచయమేగా?'' అంది పరిమళ తన ఫ్రెండ్స్‌తో.


"మీ అన్నయ్య పెళ్లికి మమ్మల్ని పిలువలేదేంటే?'' అని అడిగింది కాంచన అనే అమ్మాయి.

"మిమ్మల్ని పిలవకుండా ఎలా ఉంటాను? మా అన్నయ్యకు ఇంకా పెళ్లి కాలేదు'' అంది పరిమళ.



## పాపం సిమ్రాన్!

సిమ్రాన్ రీఎంట్రీ కాస్త అట్టహాసంగానే జరిగినా అంతే వేగంగా తిరోగమనం పాలైంది. పెళ్లికి ముందు ఎంత క్రేజ్ వుండేదో పెళ్లిచేసుకుని, బిడ్డ తల్లయిన తర్వాత సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించి ఫెయిలైంది సిమ్రాన్. టీవీలోనూ అపజయాన్నే చవిచూసింది. దాంతో నిర్మాతగా మారి సినిమాలు తీద్దామనుకున్న సిమ్రాన్ తమిళంలో క్రేజ్ వున్న హీరోలు విజయ్, విశాల్‌లను సంప్రదించిందిట. కానీ వాళ్లు తమ కాల్షీట్లు ఖాళీలేవన్నారట నిర్మొహమాటంగా. దీంతో ఇప్పుడు చిత్రనిర్మాణం కూడా విరమించుకుందామనే నిర్ణయానికొచ్చిందిట.




"అవునా? పిల్లల తండ్రిలా ఉంటే పెళ్లయిపోయిందనుకున్నాను. సారీ'' అంది కాంచన.

చరచరా లోపలకు నడిచాడు రాజు.

"నెత్తిన జుట్టు, మీసాలు ఇంకా తెల్లబడలేదుగానీ రంగు కొంచెం తగ్గినట్టుగానే ఉంది. ఇంతకుమునుపులా లేడు పాపం'' మరో అమ్మాయి చేస్తున్న కామెంట్ రాజు చెవుల్లో పడింది.

లేచి గబగబా మొహం కడుక్కుని అద్దం ముందు కూర్చుని దువ్వెన తీసుకున్నాడు. అప్రయత్నంగా అద్దంలో తన కళ్లను పరిశీలనగా చూసాడు.

'కళ్లు లోతుగా పోయాయని చెప్పింది అమ్మ. నిజమేనా?' అని చూసుకున్న రాజుకు నిజంగానే తన కళ్లు నిస్తేజంగా కనిపించాయి. 'తను పిల్లల తండ్రిలా ఉన్నాడా? అంటే తనలో మునుపటి అందంలేదా? ఆ అమ్మాయిలకు ఎందుకలా అనిపించింది? జుట్టంతా పరిశీలనగా చూసాడు ఎక్కడైనా తెల్లవెంట్రుక కనబడుతుందేమోనని. అటువంటిదేమీ కనబడలేదు రాజుకు. అయినా దిగులుగానే అనిపించింది. ఎలాగో తయారై ఇల్లు వదిలి బయటకువచ్చాడు. ఎదుటింటి కిటికీలోంచి ఆ అమ్మాయి చూస్తోంది. 'వయస్సు పైబడుతున్నా పాపం ఈ అబ్బాయికి ఎందుకు పెళ్లి కావడంలేదో' అనుకుంటోందేమో?

రోడ్డుమీద స్కూటర్‌పై వెళ్తుంటే ఎవ్వరైనా అమ్మాయిలుచూస్తే స్టైల్‌గా రొమ్ము విరుచుకునేవాడు.

ఇప్పుడు ఎందుకో ఎవరు తనను చూసినా వాళ్లు జాలిగా చూస్తున్నట్లు అనిపించసాగింది.

వారంరోజుల్లో రాజు నిజంగానే జబ్బు మనిషిలా తయారయ్యాడు. 'జగదేకసుందరుడని విర్రవీగేవాడిని ఇప్పుడు ఇలా మారిపోతున్నానేమిటి?' అని తనలో తనే మదనపడసాగాడు.

'ఆ అమ్మాయి ఉసురు నీకు తగలదూ?' అని మురళి అన్న మాటలు గుర్తుకువచ్చాయి. నిజమే అనవసరంగా లక్షణంగా ఉన్న అమ్మాయిలందరికీ పెళ్లిళ్లు అయిపోయాయి. పనిగట్టుకుని తనను వెక్కిరిస్తున్నట్లు తమకు కూడా ఇన్విటేషన్ పంపించారు ప్రతివారు. ఇక తనను ఇష్టపడే అమ్మాయిలు దొరుకుతారా అన్న సందేహం ఏర్పడింది. ఎవ్వరైనా అమ్మాయి తనకు నచ్చినా ఆ అమ్మాయికి తన నచ్చుతాడా అన్న నమ్మకం కూడా పోయింది. సుమతి గుర్తుకువచ్చింది. ఆమెకింకా పెళ్లికాలేదు. ఇప్పుడు ఒప్పుకుంటుందా?

ఏదో నిర్ణయానికి వచ్చినవాడిలా వెంటనే ఇంటికి ఫోన్ చేసాడు.

"హలో'' అవతలివైపు నుంచి చెల్లెలు పరిమళ గొంతు.

"చెల్లాయ్! అమ్మతో చెప్పు ఆ అమ్మాయి... అదే సుమతిని పెళ్లి చేసుకోవడం నాకిష్టమేనని చెప్పు. వీలైనంత త్వరలో...'' ఆపైన చెప్పడానికి సిగ్గుపడ్డాడు రాజు.

"అలాగే పెళ్లికొడకా'' అని నవ్వి ఫోన్ పెట్టేసింది పరిమళ.

వెంటనే మళ్లీ ఫోన్ తీసి సుమతి నెంబర్‌కు డయల్ చేసింది.

సుమతి లైన్లోకి రాగానే చెప్పింది పరిమళ "హల్లో! సుమతీ ... నువ్వు చెప్పినట్లే అందరం మా డైలాగులను తూచా తప్పకుండా చెప్పాము. అబ్బాయిగారు బాగా డీలా పడిపోయారు. ఇంతకుముందే ఫోన్ చేసి నీ మెడలో మూడుముళ్లు వేయడానికి అంగీకారం తెలిపాడు. బాగా అయింది అబ్బాయిగారి పెళ్లి. నీ తెలివితేటలకు జోహార్లు. ఇక అసలు పెళ్లికి కాచుకో... ఇంకా అమ్మా నాన్నలకు చెప్పలేదు. నేను మళ్లీ ఫోన్ చేస్తానులే సుమతి... సారీ వదినా!''

★